క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని నాలుగు బోరుబావుల్లో మూడింటిలో నీరు ఇంకి పోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. స్థానిక నాయకులు సమస్యను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రెండు బోర్లు వేయాలని అధికారులను ఆదేశించారు. రెండింటిలో నీరు సమృద్ధిగా పడడంతో శనివారం ఆర్ డబ్ల్యూఎస్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మోటార్లు బిగించి తాగునీటి సరఫరాను ప్రారంభించారు.

ప్రభుత్వ భవనాల పరిశీలన

బేతంచెర్ల: మండలపరిధిలోని కొలుములపల్లె గ్రామంలో రూ. 35 లక్షల తోగ్రామ సచివాలయం, రూ. 21.80 లక్షలు రైతు భరోసా కేంద్రం, రూ. 17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పరిశీలించారు. భవనాల్లో కల్పించిన వసతులపై అధికారులు, కాంట్రాక్టర్‌తో వారు చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు ఎద్దులన్న పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దారం వెంకట సుబ్బా రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, సర్పంచ్ గుమ్మగాల్లరాజు, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, గ్రామ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మద్దిలేటి తదితరులు దారం వెంకట సుబ్బారెడ్డి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నకిలీ విత్తన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

బనగానపల్లె రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నకిలీవిత్తనలు విక్రయించే వ్యాపారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రామచంద్రయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభ బనగానపల్లె పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయ కులు సుబ్బారెడ్డి,వెంకటశివుడు, నారాయణ, చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పరిశీలన



రేషన్ పరిశీలిస్తున్న ప్రసాద్ బాబు

అవుకు: మండల పరిధిలోని శివవరంలో ఎండీయూ సిబ్బంది శనివారం చేపట్టిన రేషన్ పంపిణీని తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు పరిశీలించారు. బియ్యం, షుగర్, రాగులు తదితర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఆదేశించారు. అలాగే శివవరంలో భూ రీసర్వే పూర్తయిన నేపథ్యంలో గ్రామసభ నిర్వహించారు. రీ సర్వేలో నెలకొన్న సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తునట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు బేతంచర్ల రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తారన్నారు. అలాగే పశువైద్య శాల ఆవరణంలో రూ.23.90లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం-2.రాంభూపాల్‌రెడ్డి నగర్‌లోని రూ.23.90లక్షలతో నిర్మించిన రైతుభరోసా-3 భవనాలను ఎమ్మెల్యే కాటసాని ప్రారంభిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలనిపిలుపునిచ్చారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్ వర్తింపు
- పింఛన్ అందలేదనే నిరాశ, నిరీక్షణకు స్వస్తి చెప్పిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- తలుపుతట్టి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయం
- పెంచిన పింఛన్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బనగానపల్లె : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



అవుకు : పింఛన్ కానుకను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, ఎంపీపీ చల్లా

బనగానపల్లె/అవుకు: ప్రజా సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ప్రత్యేకించి గత ప్రభుత్వ పాలనలో పింఛన్ అందలేదనే నిరాశ, మంజూరైన సొమ్మును సైతం తీసుకునేందుకు లబ్ధిదారులు నిరీక్షించాల్సిన దుస్థితికి సీఎం జగనన్న స్వస్తి చెప్పారని, అర్హులందరికీ వర్తింపజేసి అండగా నిలిచారన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన పింఛన్ సొమ్ము పొందేందుకు అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతు తదితర లబ్ధిదారులు పడరాని పాట్లు పడేవారని, రోజుల తరబడి ఎదురు చూపులు తప్పేవి కావని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు గుర్తించిన సీఎం... వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ఒకటవ తేదీనే సూర్యోదయానికి ముందే తలుపుతట్టి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారని, వలంటీర్ల సేవలను ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారని గుర్తు చేశారు. బనగానపల్లె, అవుకు మండల కేంద్రాల్లో శనివారం పెంచిన పింఛన్ ఉత్సవాలు పండుగలా జరిగాయి. బనగానపల్లె ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని పొదుపు భవనంలో ఎంపీడీఓ శివ రామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. అదేవిధంగా అవుకు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక నగదును ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే కాటసాని ప్రసంగించారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 39లక్షల పింఛన్లకు రూ.400కోట్లు పంపిణీ జరిగేదని, వైఎస్సార్ ప్రభుత్వంలో 66.34 లక్షల పింఛన్‌దారులు ఉండగా నెలకు రూ.1,968 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ మంజూరు కావాలంటే పింఛన్ పొందుతున్న వారిలో ఒకరు మరణిస్తేనో, జన్మభూమి కమిటీలు చెప్పిన వారికో, టీడీపీ నాయకుడి అనుచరులకో తప్పా కొత్తవారికి పింఛన్ అందేవికాదన్నారు. ఇప్పుడు అర్హత ఉంటే చాలు ఇళ్ల వద్దకే పింఛన్ అందుతుందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్ రూ. 3 వేలు పెంచిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కాటసాని కోరారు. కార్యక్రమంలో బనగానపల్లె ఎంపీపీ మానసవీణ, వైస్ ఎంపీపీ ఎం లక్ష్మీదేవి, షేక్‌కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, ఈఓ ఖాలీల్, మండల కోఆప్షన్ సభ్యులు అనిల్, రాష్ట్ర ముస్లీం మైనార్టీ వైఎస్సార్‌సీపీ కార్యదర్శి అత్తార్‌జాహెద్‌హుస్సేన్ సర్పంచ్‌లు రమణ, మోహన్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, తులసిరెడ్డి, శివరామ్ రెడ్డి, చినప్పరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, ఈఓ అశ్విన్, సర్పంచ్ మందా గుర్రమ్మ, బలిజ సంఘం నాయకులు రామన్న, కంపిలి నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం నాయుడు, లక్మానాయక్, వెంకటేశ్వరరెడ్డి, మూరబోయిన మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు జగనున్నాడనే భరోసా కలిగింది..



నేను, మా అమ్మ ఇద్దరమూ దివ్యాంగులమే. మా అమ్మకు మాత్రమే పింఛన్ వచ్చేది. జీవనానికి ఇబ్బందులు పడుతున్నాం. తనకు కూడా మంజూరు చేయించాలని అధికారులను సంప్రదించా. ప్రభుత్వం అవకాశం కల్పిస్తే మంజూరు చేస్తామన్నారు. నేడు నాకు కూడా పింఛన్ మంజూరైంది. రూ. 3 వేలు తీసుకున్నా. చాలా సంతోషంగా ఉంది. మాకు జగనన్న ఉన్నాడనే భరోసా కలిగింది. సీఎం సాయం మరువం. –వడ్డె వెంకట సుబ్బయ్య, దివ్యాంగుడు, అవుకు.

భర్త మృతి చెందిన నెలలకే వితంతు పింఛన్ మంజూరు



నా భర్త మర్రివెంకటేశ్వర్లు కొన్ని నెలల క్రితం మృతి చెందాడు. వలంటీర్ సాయంతో సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. పింఛన్ ఇంత త్వరగా వస్తుందని ఏ మాత్రం అనుకోలేదు. కేవలం నెలల్లోనే పింఛన్ మంజూరైంది. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సమయంలో పింఛన్ ఆసరగా ఉంటుంది. నేడు రూ. 3 వేలు పింఛన్ సొమ్ము తీసుకున్నా. చాలా సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. – మర్రి రమణమ్మ, లబ్ధిదారురాలు, రామతీర్థం

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బాధితురాలికి నగదు అందజేస్తున్న దృశ్యం



నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన చాకలి తిరుపాలు అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నరేంద్ర ఆధ్వర్యంలో కాలనీ వైఎస్సార్‌సీపీ నాయకులు దస్తగిరి, బాల హుస్సేన్ చేతుల మీదుగా మృతుడి భార్య లక్ష్మీదేవికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు అందజేశారు.

డోన్ టౌన్: మండలంలోని చిన్నమల్కాపురం ఎస్సీ కాలనీకి చెందిన దొరపల్లె నగేష్ గుండె పోటుతో మృతి చెందాడు. ఈ మేరకు శనివారం వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా మృతుని భార్య లక్ష్మీదేవికి రూ. 10వేలను ఎంపీటీసీ సభ్యురాలు సువర్ణ, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ శేఖర్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు, వలంటీర్ తిమ్మేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి

డోన్ టౌన్ : ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయం అని ఇందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ నూతన అతిథి గృహంలో ఎంపీడీఓ శ్రీనివాసుల ఆధ్వర్యంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల పరిధిలో అభివృద్ధి పనులను వివరించారు. చెరువులకు నీటి మళ్లింపు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో పీఆర్, ఆర్ డబ్ల్యూఎస్,ఎలక్ట్రికల్ ఏఈలు నారాయణ, సతీష్, నాగేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం, ఎంఈఓ ప్రభాకర్, ఏఓ షఫీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వ సేవలు



హెల్త్ క్లినిక్ పారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలోనే అందజేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని నందివర్గంలో రూ.20.70లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్‌క్లినిక్, రూ.23.94లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.63లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. అలాగే రెండు సీహెచ్‌సీ గ్రూపులకు రెండు ట్రాక్టర్లతో పాటు వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయం ఆవరణలో సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గతంలో విత్తనాలు, ఎరువులు కోసం మండల కేంద్రానికి వెళ్లి రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. అలాగే ఆరోగ్య సమస్యలు వచ్చిన మండల కేంద్రం వెళ్లాల్సివుండేదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని, అన్ని సేవలు స్వగ్రామంలోనే అందుబాటులోకి వచ్చాయని వివరించారు. అదేవిధంగా కోర్టు కేసు పరిష్కారం కావడంతో నందవరం గ్రామానికి చెందిన 110 మంది పేదలకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, ఏఓ సుబ్బారెడ్డి, పీఆర్ ఏఈ మహేష్, డాక్టర్ సుష్మ, పీఎస్ సుహాషిణి, ఎంపీపీ మానసవీణ, వైస్ ఎంపీపీ ఎం లక్ష్మీదేవి, కుర్ని కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామలదేవి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అవుకు, బనగానపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ మెటికలనారాయణ, ఉప సర్పంచ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అంబాపురం సర్పంచ్ పై చీటింగ్ కేసు

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం సర్పంచ్ శ్రీనివాసులుపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. 2019లో ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమిని(సర్వే నంబర్ 1161) తన పూర్వికులకు చెందినదిగా పాసుపుస్తకాలను తనతో తోపాటు తండ్రి, భార్యలపై నకిలీ పత్రాలు సృష్టించి మాల్కాపురం యూనియన్ బ్యాంకులో రుణం తీసుకున్నారు. తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి ఫిర్యాదు మేరకు అతనిని అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేసి డోన్ కోర్టుకు కురిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నుంచి హరినాథరెడ్డి బహిష్కరణ

డోన్ : పట్టణంలోని 32వ వార్డు కౌన్సిలర్ దార హరినాథరెడ్డిని వైఎస్సార్‌పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆయన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో క్రమ శిక్షణ కమిటీ సిఫారుసుల మేరకు కేంద్ర కార్యాలయం ఈ నిర్ణయం తీసుకుంది.

హత్యకు పాల్పడిన వారిని ఉరి తీయాలి

డోన్ టౌన్ : కడప జిల్లా బద్వేల్ పట్టణంలో వడ్డెర యువకులైన వడ్డె ప్రశాంత్,వడ్డె సాయికుమార్‌ను నడి రోడ్డుపై హత్య చేసిన వారిని ఉరి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు లక్ష్మినారాయణ,ఎల్లస్వామి,శ్రీను,నాగరాజు,గౌండ ఏసు,గొవిందు,వంశీ,చరణ్ పాల్గొన్నారు.

8 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

డోన్ టౌన్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణ సమీపంలోని దొరపల్లె గ్రామంలో ఈ నెల 8 నుంచి టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 7వతేదీలోపు ఎంట్రీ ఫీజు రూ.600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మొదటి, రెండవ బహుమతులు రూ.25వేలు, రూ.10వేలు చొప్పున అందజేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఏర్పడుతుందని ఏఈ వినయ్ కుమార్ తెలిపారు. హుసేనాపురం, పీఆర్ పల్లి, నల్లమేకలపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉద యం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేడు రంగాపురం గ్రామంలో...

బేతంచెర్ల: రంగాపురం గ్రామంలో జరుగుతున్న రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీ మధు సూధన్ రెడ్డి తెలిపారు.

సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక

కోవెలకుంట్ల: స్థానిక జ్యోతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు సౌత్ జోన్ జూనియర్ షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సింధూరి తెలిపారు. మల్లికార్జున, రామచరణ్‌లు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 13, 14వ తేదీల్లో విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్‌తోపాటు కరస్పాండెంట్ సవిత్నాథ్‌రెడ్డి భినందించారు.



పులివెందులకు వెళ్లి కేశాలుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీనివాసులు



డోన్: పట్టణంలో వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న కౌన్సిలర్ రమణ



అవుకు: ఉప్పలపాడులో లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి



బేతంచెర్ల: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రత్నమయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్